సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం, 24, జూన్, 2024



జనరల్ కోచ్‌ల కోసం వెతుకులాట!

దయచేసి వినండి అనే అనౌన్స్‌మెంట్ రాగానే రైలు ప్లాట్‌ఫామ్‌కు చేరుకున్న పేద, మధ్య తరగతి ప్రయాణికులు జనరల్ బోగీల కోసం వెతుకులాడుకోవాల్సి వస్తోంది. -8లో



విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి తూతిక విశ్వనాథ్ పేర్కొన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.680	రూ.780
రెండోరకం	రూ.520	రూ.640

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 644 మెట్రిక్ టన్నులు



మళ్లీ మంచి రోజులు వస్తాయి



పులివెందులలోని క్యాంపు కార్యాలయం వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- శిశుపాలుడి పాపాలు లెక్కగడుదాం
- కష్టాలను ధైర్యంగా ఎదుర్కొందాం
- పులివెందుల కార్యాలయంలో కార్యకర్తలు, ప్రజలతో మాజీ సీఎం వైఎస్ జగన్
- ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, మేయర్, ప్రజాప్రతినిధులతో చర్చలు
- అభిమాన నేతను కలిసేందుకు తరలివచ్చిన జనం
- మాజీ సీఎం వైఎస్ జగన్‌ను చూడగానే ఉప్పొంగిన ఉత్సాహం

సాక్షి ప్రతినిధి, కడప/పులివెందుల: 'ప్రజలకు మన పట్ల విశ్వాసం ఉన్నా మోసకారి మాటలు నమ్మి 10 శాతం అటు వైపు మొగ్గారు. మనలాగా రాజకీయాలకు అతీతంగా పాలన చేయడం వారికి చేతకాదు. కులం, మతం చూడకుండా, రాజకీయ పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలు అందించలేరు. శిశుపాలుడి లాగా పాపాలు చేసుకుంటూ పోతున్నారు. చంద్రబాబు ప్రజల్లో త్వరలోనే విశ్వాసం కోల్పోనున్నారు. ఎవ్వరూ అధైర్యపడొద్దు. రాబోవు కాలం మనదే. ప్రతి కుటుంబంలో మనం చేసిన మంచి ఉంది. మనపట్ల ప్రజలకు విశ్వాసం ఉంది. భవిష్యత్ మనదే '.. అని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం రోజంతా పులివెందులలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, ప్రజలతో ఆయన మమేకమయ్యారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి మాట్లాడుతూ అందరం ధైర్యంగా దీటుగా చంద్రబాబు సర్కార్ అణచివేత చర్యలను అడ్డుకుందాం. ప్రతీ కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా తనతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ప్రజలకు మనపైనే విశ్వాసం...

'మనం చెప్పిన పనులన్నీ చేశాం. మనం చేసిన మంచి ప్రతి కుటుంబంలో ఉంది. అందుకే ప్రజలకు మనపైనే విశ్వాసం ఉంది'.. అని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మనల్ని నమ్మి 40 శాతం మంది ఓట్లు వేశారు. 10 శాతం మంది అధికంగా మూడు పార్టీల కూటమి వైపు మొగ్గు చూపారు. త్వరలోనే చంద్రబాబు తమను మరోమారు నమ్మించి మోసం చేశారని ప్రజలు గ్రహిస్తారు. ఆపై ప్రజలే తిరగబడే రోజు ఒకటి వస్తుంది. నిరంతరం ప్రజాశ్రేయస్సుకు అనుగుణంగా అడుగులు వేయాలి.. అని శ్రేణులకు ఆయన దిశా నిర్దేశం చేశారు.



ప్రజల వినతులను ఓపికగా పరిశీలిస్తున్న వైఎస్ జగన్

పులివెందులలో కార్యకర్తలతో మమేకం..

పులివెందులలోని భాకరాపురంలో ఉన్న క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు, ప్రజలు, నేతలు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వారితో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మమేకమయ్యారు. ముందుగా పులివెందుల మున్సిపల్ కౌన్సిలర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారితో సుదీర్ఘంగా చర్చించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు వారి ఆవేదనను వెళ్లబోసుకున్నారు. కడప చిన్నచౌక్‌కు చెందిన నీరజ, వెంకటలక్షుమ్మ, జ్యోత్స్న అనే మహిళలు మాజీ సీఎంను కలిశారు. అధికారులు ఇళ్లు నిర్మిస్తామని తమ వద్ద రూ.70వేలు చొప్పున వసూలు చేసి, ప్రైవేటు కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించినట్లు తెలిపారు. ఆ పనులు పూర్తి చేయలేదు, మాకు ఇళ్లు అప్పగించలేదని వాపోయారు. ఇలా ఎవరికి వారు ఇబ్బందులు చెప్పుకుంటుంటే ఓపిగ్గా వింటూ అవసరమైన చర్యలకు సిఫార్సులు చేశారు. మరోవైపు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలవాలని, ఆయనకు అండగా నిలవాలని, మేమంతా మీ వెంటే ఉన్నామని చెప్పాలనే ఆత్రుత పెద్ద ఎత్తున ప్రజానీకంలో కన్పించింది. ఈ క్రమంలోనే పెద్ద ఎత్తున తోపులాటకు ఆస్కారం ఏర్పడింది. యువత ఎగబడడంతో కార్యాలయం కిటికీ అద్దాలు పగిలిపోయాయి. ఓ యువకుడికి అద్దాలు తగులుకుని గాయాలు సైతం అయ్యాయి. యువత మాజీ సీఎం వైఎస్ జగన్‌ను చూడగానే కేరింతలు కొట్టారు. ఫొటోలు, సెల్ఫీల కోసం ఎగబడ్డారు.

వైఎస్ సుశీలమ్మను పరామర్శించిన వైఎస్ జగన్ దంపతులు

తన పెద్దనాన్న వైఎస్ ఆనందరెడ్డి సతీమణి వైఎస్ సుశీలమ్మ గత కొద్దికాలంగా వయస్సు రీత్యా అనారోగ్యంతో ఉన్నారు. విషయం తెలుసుకున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సతీమణి వైఎస్ భారతిరెడ్డితో కలిసి పాల్‌రెడ్డి ఫంక్షన్‌హాల్ సమీపంలో ఉన్న వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా సమీప బంధువులతో మమేకమై యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజాశ్రేయస్సు కోసమే నిరంతరం పాటుపడ్డావని, ప్రజాదీవెనలతోపాటు, దేవుడి ఆశీస్సులు ఎప్పుడూ వెన్నంటే ఉంటాయని కుటుంబ సభ్యులు దీవించడం విశేషం.

తండోపతండాలుగా జన సందోహం...

పులివెందులలోని క్యాంపు కార్యాలయం కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, ప్రజలతో కిక్కిరిసి పోయింది. జిల్లా వ్యాప్తంగానే కాకుండా అనంతపురం, చిత్తూరు జిల్లాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తండోపతండాలుగా వచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులతో మాజీ సీఎం వైఎస్ జగన్ చర్చించారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, చిత్తూరు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రమేష్‌యాదవ్, శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకీయాఖానం, కడప మేయర్ సురేష్‌బాబుతోపాటు వివిధ జిల్లాలకు చెందిన మాజీ ఎమ్మెల్యేలతో సమీక్షలు నిర్వహించారు. నామినేటెడ్ కేడర్ నేతలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు కలిసి పరిస్థితులపై చర్చించారు. రాజకీయ అంశాలతో పాటు, వ్యక్తిగత యోగక్షేమాలు తెలుసుకున్నారు. కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు నేతలు అండగా నిలబడాలని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాప్రతినిధులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఎస్‌బి అంజద్‌బాషా, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాచమల్లు ప్రసాద్‌రెడ్డి డాక్టర్ సుధీర్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, రఘురామిరెడ్డి, కదిరి సమన్వయకర్త మగ్బూల్ బాషా, తాడిపత్రికి చెందిన బోగతి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ జగన్‌ను కలిసేందుకు తరలి వచ్చిన అభిమానులు



తనను చూసి భావోద్వేగానికి గురైన వృద్ధురాలిని ఓదారుస్తున్న వైఎస్ జగన్



పెద్దనాన్న వైఎస్ ఆనందరెడ్డి సతీమణి వైఎస్ సుశీలమ్మను పరామర్శిస్తున్న వైఎస్ జగన్



అభిమాన నేతతో సెల్ఫీకి పోటీ పడుతున్న యువత

న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం

రాయచోటి: ప్రజా సమస్యల వినతులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 24న ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రం, రాయచోటితోపాటు గ్రామ, మండలం, డివిజన్ స్థాయిలలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్‌లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమానికి రావాలని సూచించారు.

30న బ్యాడ్మింటన్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడపలోని పీవీఆర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 30వ తేదీన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డా. సింగం భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి తెలిపారు. అండర్-19 జూనియర్ విభాగం బాలబాలికలతో పాటు సీనియర్ విభాగంలో పురుషులు, మహిళల విభాగం ఎంపికలు జరుగుతాయన్నారు. సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో విడివిడిగా ఎంపికలు నిర్వహించి జిల్లా జట్లను ప్రకటించనున్నట్లు తెలిపారు. అండర్-19 విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 2006 జనవరి 1 తర్వాత పుట్టినవారై ఉండాలన్నారు. సీనియర్స్ విభాగానికి ఎలాంటి వయోపరిమితి లేదన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే సీనియర్ విభాగం క్రీడాకారులు ఆగస్టు నెలలో విజయనగరంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో, జూనియర్ విభాగం క్రీడాకారులు శ్రీకాకుళంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని బ్యాడ్మింటన్ సంఘం జిల్లా చైర్మన్ ఎస్. జిలానీబాషా తెలిపారు. ఎంపికల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు తమ ఎంట్రీలను 29వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు 9440223908, 9885367562 నంబర్లలో రిజిష్టర్ చేసుకోవాలని సూచించారు.

బాల్యంపై పుస్తకాల భారం!

- ఏటా పెరుగుతున్న పుస్తకాలు
- నిర్దేశించినవి కొనాల్సిందేనని పాఠశాలల ఒత్తిడి
- వయస్సుకు మించి భారం
- ఎదుగుదలకు ఆటంకం
- విద్యార్థుల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం



మదనపల్లె సిటీ: అడుతూ పాడుతూ చదువుకోవాల్సిన వయసులో పుస్తకాల భారం విద్యార్థులకు శాపంగా మారుతోంది. ఏటా పై తరగతికి వెళ్తుంటే... పుస్తకాల సంఖ్య కూడా దానికి తగ్గట్టుగానే పెరుగుతోంది. ప్రైవేటు స్కూళ్లలో వాటిని మోస్తూ పిల్లలు పడే బాధలు అన్నీఇన్నీ కావు. బ్యాగు నిండా పుస్తకాలతో నాలుగైదు అంతస్తుల మెట్లు ఎక్కేందుకు నానా తంటాలు పడుతున్నారు. పుస్తకాల భారం తగ్గించాలని 2006లో చట్టం చేసినా అమలుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదు.

ప్రైవేటుగానూ కొనుగోలు..

ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు విధిగా ప్రభుత్వం ముద్రించిన పాఠ్యపుస్తకాలతోనే విద్యార్థులకు పాఠాలు బోధించాలి. స్టేట్, సీబీఎస్‌ఈ సిలబస్ మినహా మరే ఇతర పాఠ్యాంశాలను బోధించరాదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఐఐటీ కోచింగ్, స్మార్ట్ క్లాసులు, రివిజన్ టెస్టుల పేరుతో సాధారణ పాఠ్యపుస్తకాలతో పాటు ప్రైవేటు ముద్రణ సంస్థల పుస్తకాలను కొనుగోలు చేయాల్సిందిగా తల్లిదండ్రులకు సూచిస్తున్నారు.

అనవసరమైనవే ఎక్కువ..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరు సబ్జెక్టులకు ఆరు పాఠ్యపుస్తకాలు, మరో ఆరు నోటు బుక్స్, కాపీరైట్‌కు సంబంధించి నాలుగు పుస్తకాలు ఉంటాయి. ప్రైవేటు పాఠశాలలు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ తల్లిదండ్రులపై ఫీజులు, విద్యార్థులపై పుస్తకాల భారం మోపుతున్నాయి. ఒకటో తరగతి చదివే విద్యార్థికి సాధారణంగా 14 పుస్తకాలు ఉండాలి. కానీ 32 నుంచి 34 ఉంటున్నాయి. ప్రింటెడ్ కాపీరైట్, ప్రింటెడ్ కలర్ కంపోజింగ్, హోం స్కూల్ ఎక్సర్‌సైజ్, రైటింగ్ ఇంప్రూమెంట్, లాంగ్వేజ్ డిక్షనరీ, డ్రాయింగ్ తదితరాలను అదనంగా జోడిస్తున్నాయి. అనవసర పుస్తకాలు మోస్తున్న చిన్నారుల వెన్నెముకపై తీవ్రమైన ప్రభావం పడి ఎదుగుదల సక్రమంగా జరగకపోయే ప్రమాదం ఉంది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 2, 54,630 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో ప్రాథమిక పాఠశాలల్లో 86,094 మంది, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 30,739 మంది, ఉన్నత పాఠశాలల్లో 1,37,743 మంది చదువుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో 1,08,538 మంది విద్యార్థులు చదువుతున్నారు.

నిబంధనలు బేఖాతరు..

ఏటా డీఈఓ ద్వారా వార్షిక విద్యా ప్రణాళిక విడుదలవుతుంది. పాఠ్యాంశాలు, పరీక్ష, సాంస్కృతిక, ఆరోగ్య పరిరక్షణ కింద పలు అంశాలతో పట్టిక రూపొందించాల్సి ఉన్నప్పటికి అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. ప్రైవేటు పాఠశాలల కోసం ప్రత్యేక నిబంధనలతో పట్టిక విడుదల చేసి ఆయా పాఠశాలల్లో రోజువారీ నిర్వహించాల్సిన కార్యక్రమాలపై నిరంతరం తనిఖీలు చేపట్టాల్సి ఉండగా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు.

వైద్య నిపుణుల సూచనలు..

- పిల్లల్లో సాధారణంగా 15 ఏళ్ల లోపే శరీరంలో వివిధ మార్పులు చోటు చేసుకుంటాయి. పాఠశాలల వయసులో మోయాల్సిన భారం కంటే అధిక బరువు మోయడం వల్ల స్కోలియోసిస్ (వెన్నెముక ఒకవైపు వంగి పోవడం) వంటి ఇబ్బందులు తలెత్తుతాయి.
- అధిక బరువుతో కూడిన పెద్ద సైజు కాకుండా పుస్తకాలు సరిపడా తేలికైనవి కొనుగోలు చేయాలి.
- విద్యార్థి బరువులో పుస్తకాల బరువు 15 శాతానికి మించరాదు. ఉదాహరణకు 20 కిలోల బరువున్న విద్యార్థి 3 కిలోలకు మించి మోయరాదు.
- ఎక్కువ పుస్తకాలున్న పక్షంలో ఉపాధ్యాయుల సలహా మేరకు ఏ రోజున అవసరమైన పుస్తకాలను ఆ రోజున తీసుకెళ్లేలా తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలి.
- బ్యాగును రెండు భుజాలపై సమాన బరువుపడే రీతిలో తగిలించుకోవాలి. ఒకవైపు తగిలించుకుంటే భుజం, మెడ నొప్పి వస్తాయి.
- నిత్యం వ్యాయామం చేయడం వల్ల శారీరకపరమైన ఇబ్బందులు అధిగమించవచ్చు.

ప్రైవేటు పాఠశాలల్లో ఇలా...

తరగతి	బ్యాగు బరువు (కిలోలు)
ఒకటి	6
రెండు	7
మూడు	9
నాలుగు	12
ఐదు	14
ఆరు	16
ఏడు	18
ఎనిమిది	25
తొమ్మిది	25
పది	25 పైబడి

తల్లిదండ్రుల్లో మార్పు రావాలి



తల్లిదండ్రుల దృక్పథంలో మార్పు రావాలి. పుస్తకాలు ఎక్కువగా ఉంటే తమ పిల్లలు గొప్పగా చదువుకుంటారని అనుకుంటున్నారు. అలాంటి పాఠశాల కూడా గొప్పదని భావిస్తున్నారు. మోసే పుస్తకాలకు చదివే చదువులకు సంబంధమే ఉండదు. ఇటీవల క్వశ్చన్ బ్యాంకులనూ తీసుకెళ్తున్నారు. ఇవి మరింత భారంగా మారుతున్నాయి. -ఖమర్ అమీని, విద్యావేత్త, మదనపల్లె

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయాలి



విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడమే నిజమైన విద్య. అది కేవలం పుస్తకాల వల్ల రాదు. సర్వతోముఖ ప్రక్రియల ద్వారానే విద్యార్థుల్లో సృజనాత్మకతలు వెల్లి విరుస్తాయి. అందులో భాగమే నో స్కూల్ బ్యాగ్ డే. ఆ రోజు ప్రత్యేకంగా సృజనశీలత కార్యక్రమాలు నిర్వహించాలి. -సేగు రెడ్డప్పరెడ్డి, అధ్యాపకులు, మదనపల్లె

హార్సిలీహిల్స్ సందర్శించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి

బి.కొత్తకోట: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కుమార్, హర్యానా ఫీ రెగ్యులేటరీ కమిటీ, అప్పిలేట్ అథారిటీ జస్టిస్ సురీందర్ గుప్త ఆదివారం బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ సందర్శించారు. మధ్యాహ్నం కొండకు చేరుకున్న ఆయనకు మదనపల్లె ఆర్డీఓ హరిప్రసాద్, డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ పుణ్యవతి స్వాగతం పలికారు. మూడురోజుల పర్యటనలో భాగంగా విచ్చేయగా జిల్లా పోలీసు అధికారులు ఇక్కడి పోలీసు అతిథి గృహంలో విడిది ఏర్పాట్లు చేశారు.

వైవీయూ, పద్మావతి వర్సిటీల మధ్య ఎంఓయూ



ఎంఓయూ కుదర్చుకుంటున్న వైవీయూ, పద్మావతి విశ్వవిద్యాలయాల అధికారులు

వైవీయూ: కడప యోగివేమన విశ్వవిద్యాలయం, తిరుపతి పద్మావతి విశ్వవిద్యాలయం మధ్య పరస్పర అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. యోగివేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ఐటీ సెల్ డైరెక్టర్ ఆచార్య టి. శివప్రతాప్, శ్రీపద్మావతి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య డి. భారతి, రిజిస్ట్రార్ ఆచార్య రజిని లు ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ భారతి మాట్లాడుతూ వైవీయూతో అనేక సాంకేతిక పరమైన ప్రయోజనాలు పొందేందుకు ఒప్పందం చేసుకున్నామన్నారు. సీఏఎస్ ప్రమోషన్ (అసిస్టెంట్లు, అసోసియేట్, ప్రొఫెసర్ల పదోన్నతి) కి సంబంధించి ఆన్లైన్ దరఖాస్తుల స్వీకరణ దగ్గర నుంచి ఆ ప్రక్రియ పూర్తయ్య వరకు సాంకేతికతను వినియోగించిన తొలి విశ్వవిద్యాలయంగా వైవీయూ ఉండడంతో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు వీసి వెల్లడించారు. వైవీయూ ఐటీ హబ్ సేవలను పొందనున్నామని తెలిపారు. తద్వారా సిఏఎస్ ప్రక్రియ త్వరితగతిన పూర్తవుతుందని ఆకాంక్షించారు. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ వైవీయూ ఐటీ హబ్ అందించే సేవల ద్వారా ఆర్థిక ప్రయోజనం విశ్వవిద్యాలయానికి సమకూరుతుందన్నారు.

క్లుప్తంగా

క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తిచేయాలి

రాయచోటి అర్బన్ : ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియ వెంటనే పూర్తిచేయాలని ఏపీ కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల ఐకాస రాష్ట్ర కన్వీనర్ వై.విశ్వనాథరెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సోమవారం జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో క్రమబద్ధీకరణ అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. వైద్య ఆరోగ్యశాఖలో 2002 డీఎస్సీ ద్వారా నియమింపబడి కాంట్రాక్టు మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారిని పాలకులు వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు. యాక్ట్ 30 ఆఫ్ 2023ను వెంటనే అమలుచేయడం ద్వారా 10,117 మందిని రెగ్యులర్ చేయాలని వారు కోరారు.

ఫార్మసీ విద్యార్థి మృతి



మృతిచెందిన అప్సర్

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరులో చికిత్స పొందుతున్న ఫార్మసీ విద్యార్థి ఆదివారం మృతిచెందినట్లు తాలూకా సీఐ ఎన్.శేఖర్ తెలిపారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. మదనపల్లె పట్టణం నెహ్రూ నగర్‌కు చెందిన రిజ్వాన్ కుమారుడు షేక్ అప్సర్ (20) సీటీఎం సమీపంలోని మహతి ఫార్మసీ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఈ నెల 21న అప్సర్ కాలేజీకి వెళ్లి ఇంటికి తన బుల్లెట్ వాహనంలో వస్తుండగా, మార్గ మధ్యంలో సామలగడ్డ వద్ద లగేజీ ఆటో ఢీకొంది. ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై 108 అంబులెన్స్‌లో మదనపల్లె ఆస్పత్రికి తరలించగా, చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నీటి గుంతలో పడి చిన్నారి..



మృతిచెందిన చిన్నారి ఈశ్వరయ్య

పెద్దమండ్యం : నీటి గుంతలో పడి ఓ చిన్నారి మృతి చెందిన సంఘటన మండలంలోని కుంటకింద గొల్లపల్లెలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన పరదేశి శ్రీనివాసులు కుమారుడు ఈశ్వరయ్య(8) బండెపురెడ్డిగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో పల్లెకు సమీపంలోని చిన్నాయునికుంటలో మరో ముగ్గురు పిల్లలతో కలిసి ఆడుకోనేందుకు వెళ్లారు. లోతుగా ఉన్న గుంతను గమనించక చిన్నారి అందులో పడిపోయాడు. తోటి చిన్నారులు గుంతలో పడిన విషయాన్ని పల్లెలోకి వచ్చి తెలిపారు. యువకులు అక్కడికి వెళ్లి చూసి చిన్నారిని వెలికితీయగా అప్పటికే మృతిచెందాడు. చిన్నారి మృతితో పల్లెలో విషాదం నెలకొంది.

జనరల్ కోచ్‌ల కోసం వెతుకులాట!

దయచేసి వినండి అనే అనౌన్స్‌మెంట్ రాగానే రైలు ప్లాట్‌ఫామ్‌కు చేరుకున్న పేద, మధ్య తరగతి ప్రయాణికులు జనరల్ బోగీల కోసం వెతుకులాడుకోవాలి. ఇంజిన్ వెనకో..గార్డు బ్రేక్ ముందో ఒక బోగీ ఉంటుంది. అప్పటికే ఆ ఒక్క బోగీ కిక్కిరిసి ఉంటుంది. అందులో ప్రయాణం నరకమే. నిత్యం ఇదే పరిస్థితి ఉంటూ సామాన్యుడికి రైలు దూరమయ్యే పరిస్థితి నేటికీ మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కొనసాగుతోంది.

- పేదల ప్రయాణానికి తప్పని ఇబ్బందులు
- ధనిక వర్గాల ప్రయాణం కోసమే వందే భారత్
- ఎన్నికల ఎఫెక్ట్‌తో దిగి వచ్చిన బీజేపీ సర్కారు
- జనరల్ కోచ్‌ల సంఖ్య పెంపుపై దృష్టి

రాజంపేట : ఎన్‌డీఏ పాలనలో దేశ వ్యాప్తంగా అన్ని రైళ్ల జనరల్ కోచ్‌లు తగ్గించేశారనే అపవాదు పేదల్లో బలంగా వినిపిస్తోంది. ఇప్పుడు వాటి జాడ కనుక్కొనేందుకు ప్రయాణికులు ప్లాట్‌ఫాంపై ఉరుకులు, పరుగులు తీయాల్సి వస్తోంది. తిరుపతి–నిజామాబాద్ మధ్య నడిచే రాయలసీమ, వెంకటాద్రి , జయంతి చెన్నై–ముంబాయి ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సింగల్ జనరల్ బోగీనే కనిపిస్తోంది. వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల మీదుగా ఉండే రైల్వే మార్గంలో 25 స్టేషన్లు ఉండగా, డైలీ 30 (అప్ అండ్ డౌన్) రైళ్లు నడుస్తున్నాయి. వీటిలో ఒకే బోగీలో కిక్కిరిసిన ప్రయాణంతో పేదలు ఇబ్బందిపడాల్సి వస్తోంది. ఒక్కోసారి జనరల్ బోగీ ఎక్కలేక స్లీపర్ కోచ్ ఎక్కి టీసీల దురుసుతనంతో నెట్టి వేయబడిన సంఘటనలు కోకొల్లలు. సార్వత్రిక ఎన్నికల తర్వాత లోక్‌సభలో తన సంఖ్యా బలం పడిపోవడంతో బీజేపీ తమ నిర్ణయాలను మార్చుకునే దిశగా అడుగులు వేసింది. జనరల్ బోగీలను పెంచేందుకు దృష్టి సారించింది.

కోచ్‌ల పెంపు ప్రతిపాదనలు సిద్ధం

ముచ్చటగా హ్యాట్రిక్ ఎన్‌డీఏ పాలనలో పేద, మధ్య తరగతి ప్రయాణికుల కోసం ఒక మెట్టు దిగివచ్చేందుకు రైల్వే శాఖ సిద్ధమవుతున్నట్లు సమాచారం. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ పేద, మధ్య తరగతి ఓట్ల ప్రభావం స్పష్టంగా రుచిచూసిన క్రమంలో రైల్వే పరంగా చేసిన తప్పులను సరిదిద్దుకోవాలనే దిశగా అడుగులు వేసింది. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ కోచ్‌ల సంఖ్య రెట్టింపు దిశగా చర్యలకు దిగింది. ప్రస్తుతం రెండు కోచ్‌లున్న రైళ్లలో 4, జనరల్ కోచ్ లేని రైళ్లకు రెండు కోచ్‌లను ఏర్పాటుచేయనున్నారు. అదనంగా 1,377 స్లీపర్ కోచ్‌లు, 2,500 జనరల్ బోగీలను అందుబాటులో తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఒక్కో కోచ్‌లో 150–200 మంది ప్రయాణించే కోచ్‌ను రూపుదిద్దాలని రైల్వే శాఖ యోచిస్తోంది.

వందేభారత్‌లతో..

పేదలకు అనుకూలమైన రైళ్లు తీసుకురావడం కన్నా వందేభారత్ లాంటి ఖరీదైన రైళ్లను తీసుకురావడంతో రైల్వే శాఖ పేదలకు రైళ్లు దూరం చేస్తోందనే వాదన మేధావి వర్గాల నుంచి వినిపిస్తోంది. పేదలు ప్రయాణించే ప్యాసింజర్లను ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా మార్చి పట్టాలెక్కిస్తున్నారు. వందేభారత్‌తో దూరప్రాంత ప్రయాణికులకు మేలు జరిగినా, అందులో ధరలు చూస్తే పేద, మధ్య తరగతి వాసులు ఆ బండి దిక్కు కూడా కన్నెత్తి చూడరనేది సుస్పష్టం.



మెయిల్ ఎక్స్‌ప్రెస్

ఏసీ, స్లీపర్ కోచ్‌లే అధికం

మార్గం : ముంబాయి–చెన్నై
రైళ్లు : 30 (అప్ అండ్ డౌన్)
జనరల్ బోగీ : ఒకటి లేదా రెండు

ఇప్పుడు నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఏసీ, స్లీపర్ కోచ్‌లే అధికంగా కనిపిస్తున్నాయి. లోకో నుంచి అటు గార్డు బ్రేక్‌నుంచి ఎటు చూసినా స్లీపర్, ఏసీ కోచ్‌లున్నాయి. ఈ ఏసీలో త్రీ టైర్, టూటైర్ శ్రేణుల కోచ్‌లుంటాయి. కోచ్ పొజిషన్‌ను బట్టి స్లీపర్, ఏసీ కోచ్ పెంచాల్సిన పరిస్థితి ఉంటుంది. లేడీస్ కోచ్ ఉంటుంది. అటువంటప్పుడు సాధారణ ప్రయాణికులు రైలెక్కాలంటే ఆ సమయంలో బోగీల కోసం ఉరుకులు, పరుగులు తీయాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితి ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకున్న ఎందరో ప్రయాణీకులున్నారు.

మిలిటరీ కోచ్‌లకు మంగళం

దేశ ప్రధాని మోదీ పాలనలో వివిధ రైళ్లలో మిలిటరీ కోచ్‌లకు మంగళం పాడారు. ఒకప్పుడు ముంబై–చెన్నై మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్, బై వీక్లీ, స్పెషల్ ట్రైన్స్‌లో మిలిటరీ కోచ్‌లుండేవి. అవి ఇప్పుడు ఏ రైళ్లలోనూ కనిపించడంలేదు. ఎన్‌డీఏ సర్కారు దేశ సైనికులకు ఇచ్చే గౌరవమిదేనా అని మాజీ సైనికులు పెదవి విరిస్తున్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మిలిటరీ కోచ్‌లను ఎక్స్‌ప్రెస్ ఫార్మాసిన్‌లో అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

జనరల్ కోచ్‌ల సంఖ్య పెంచాలి



పేద, మధ్య తరగతి ప్రయాణికులను దృష్టిలో ఉంచుకోవాలి. కేవలం వందే భారత్ రైళ్ల పైనే దృష్టి సారించడం విచారకరం. ఈ రైళ్లతో పేద, మధ్య తరగతి ప్రజానీకం లాభం లేదు. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను క్రమంగా కనీసం నాలుగు ఉండేలా చర్యలు తీసుకోవాలి. కొన్ని రైళ్లలో లేడీస్ కోచ్‌లు లేవు. ప్రత్యేకంగా ప్రతి రైలులో లేడీస్ కోచ్ ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– ఆర్.శ్రీవాణిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా నేత, రాజంపేట

పేదల ప్రయాణంపై దృష్టి పెట్టాలి



రైల్వే మంత్రిత్వ శాఖ పేద వాని ప్రయాణంపై దృష్టిపెట్టాలి. జిల్లా మీదుగా నడిచే రైళ్లలో పేదోడి బోగీలు కనిపించడం లేదు. ఫలితంగా ఫార్మసిన్‌లో ఉన్న ఒక్క బోగీ కిక్కిరిసి ఉంటోంది. పేద ప్రయాణికులు రైలు ప్రయాణానికి దూరం అవుతున్నారు. ఒకప్పుడు రైళ్లు ఫార్మసిన్‌లో జనరల్ బోగీలు, మిలటరీ కోచ్‌లుండేవి. సార్వత్రిక ఎన్నికల తర్వాత మోదీ సర్కారుకు కనువిప్పు కలిగినట్లు ఉంది. అందుకే జనరల్ బోగీలను పెంచుతామనే యోచనకు వచ్చారని సమాచారం.

– ఫైజుల్లాఖాన్ లోడి, లోక్ అదాలత్ సభ్యుడు, నందలూరు

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం



హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

- దేవాంగ విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు
- ఏలూరు డీపీఓ టి.విశ్వనాథ్

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి తూతిక విశ్వనాథ్ పేర్కొన్నారు. స్థానిక వినాయక నగర్‌లోని దేవాంగ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో పది, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆదివారం నగదు, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రపంచ స్థితిగతులను మార్చే శక్తి విద్యకే ఉందన్నారు.

హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ ఆర్‌డీడీ గుత్తి రాజారావు, హైకోర్టు న్యాయవాది పిచ్చిక శ్రీనివాస్‌లు మాట్లాడుతూ విద్యార్థులు విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనం మాట్లాడుతూ 12 ఏళ్లుగా సంక్షేమ సంఘానికి దాతలిచ్చిన సాయంతో ఏటా విద్యార్థులకు సాయం అందిస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పది, ఇంటర్ చదివి ఉత్తమ మార్కులు సాధించిన 68 మంది విద్యార్థులకు రూ.1.65 లక్షల నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో బత్తల వెంకటసుబ్బయ్య, పుచ్చల రామకృష్ణ, గుత్తి త్యాగరాజు, ఆకాశపు స్వామి, గిద్దలూరు ఈశ్వరయ్య, రెడ్డి చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, గిద్దలూరు మల్లిఖార్జున, మచ్చా వెంకటసుబ్బరాయుడు, వుట్టి లక్ష్మినారాయణ, గిద్దలూరు గంగా జలందర్, పోసా వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న దేవాంగ ప్రముఖులు

నకిలీ ఎరువుతో రైతుకు దగా

గుర్రంకొండ : నకిలీ డ్రిప్ ఎరువు రైతును నట్టేట ముంచింది. మండలంలోని ఎల్లుట్ల పంచాయతీ శీలరిపల్లెకి చెందిన రామిశెట్టి రెడ్డిశేఖర్ ఎకరం పొలం కౌలుకు తీసుకుని టమాటా పంట సాగు చేశారు. మరో పది రోజుల్లో పంట కోతకు వస్తుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 19న టమాటా సైజు పెరిగేందుకు స్థానికంగా ఉన్న ఓ దుకాణంలో డ్రిప్ ఎరువు బస్తా కొనుగోలు చేశాడు. యజమానికి డబ్బు చెల్లించినా.. బిల్లు ఇవ్వకుండా తెల్ల కాగితంపై రూ.4400 రాసి ఇచ్చాడు. అనంతరం రైతు ఆ ఎరువును డ్రమ్ము నీటిలో కలిపి డ్రిప్ పైపుల ద్వారా తన పంటకు పెట్టాడు. శనివారం వరకు వేచి చూసిన అనంతరం మొక్కపై టమాటా పూత, పిందె రాలి పోవడం, చెట్టు ఆకులు ఆకుముడత రోగం వచ్చినట్లు ముడుచుకుపోవడం గమనించాడు. మళ్లీ ఆదివారం మిగిలిన సగం బస్తా వేసి కలపగా పైకి బురుగు రాకపోవడం, గంట వరకు కరగక పోవడం, గుళికలు గడ్డకట్టడం చూసి రైతు ఆశ్చర్యపోయాడు. పైగా ఆర్బీకేల్లో యూరియా బస్తా రూ.266 కాగా, అదే బస్తా ఉప్పుతో కలిపి డ్రిప్ ఎరువు అంటూ రూ.4400 వసూలు చేయడంతో తాను దగా పడ్డానని తెలుసుకున్నాడు. వెంటనే దుకాణానికి వెళ్లి బిల్లు ఇవ్వాలని నిలదీయగా, సదరు ఎరువు దుకాణం యజమాని ఇవ్వలేదు. దీంతో పంట నష్టపోయానంటూ రైతు లబోదిబోమంటూ వెనుదిరిగాడు. అధికారులు విచారించి తనకు న్యాయం చేయాలని రైతు రెడ్డిశేఖర్ కోరుతున్నారు.



నీటిలో కరగకుండా గడ్డ కట్టిన యూరియా

జిల్లా బాల్ బ్యాడ్మింటన్ కమిటీ ఎన్నిక

ప్రొద్దుటూరు కల్చరల్: మండలంలోని దొరసానిపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉమ్మడి కడప జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జనరల్ బాడీ సమావేశం, నూతన కమిటీ ఎన్నికలు ఆదివారం జరిగాయి. జిల్లా అధ్యక్షుడిగా వై.కృష్ణమూర్తి (రాజంపేట), ప్రధాన కార్యదర్శిగా జి.వెంకటరమణ (ప్రొద్దుటూరు), ట్రెజరర్‌గా శివనాగిరెడ్డి (కొండాపురం), ఉపాధ్యక్షుడిగా బాబా ఫకృద్దీన్, సురేష్‌బాబు, రవీంద్రారెడ్డి, వెంకటమునిరత్నం, నాగముని, జాయింట్ సెక్రటరీగా నందకిశోర్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా ఓబయ్య, ఇమాంబాషా, రాజశేఖర్, సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారు బాల్ బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బ్యాడ్మింటన్ వైస్ ప్రెసిడెంట్ జయరాం, వైఎస్సార్ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అబ్దుల్ మునాఫ్‌లు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఆకెపాటి శంకర్ రెడ్డి, పూర్వ కార్యదర్శి సుధాకర్‌రావు, రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు మధుసూదన రావు, లీగల్ అడ్వయిజర్ నరసింహమూర్తి, రిటైర్డ్ ప్రిన్సిపల్ సుబ్బారావు, సీనియర్ మహిళా క్రీడాకారులు సుజాత, వాణి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన బాల్ బ్యాడ్మింటన్ నూతన కమిటీ

పొలాల్లో కొండ చిలువ

కలకడ : పొలాల్లోకి కొండ చిలువ రావడంతో రైతుల్లో ఆందోళన నెలకొన్న సంఘటన కలకడ మండలం కోన పంచాయతీలో ఆదివారం జరిగింది. కోన గ్రామానికి చెందిన వి.మధుసూదన్‌రెడ్డి తోటలోకి ఉదయం మేతకోసం వెళ్లిన పొట్టేళ్ల కోసం కొండచిలువ వచ్చింది. రైతులు ఆందోళన చెంది గ్రామస్థులకు సమాచారం అందించారు. పొటేళ్ళు తప్పించుకోగా కొండ చిలువను గ్రామస్థులు కొట్టి చంపేశారు.



కొండ చిలువను చూపుతున్న రైతు మధుసూదన్‌రెడ్డి

వేర్వేరు ఘటనల్లో నలుగురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో నలుగురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. నిమ్మనపల్లె మండలం తవళం పంచాయతీ చౌకిళ్లవారిపల్లెకు చెందిన నూర్ అహ్మద్ భార్య షబ్రున్(25), కుటుంబసమస్యల కారణంగా భర్తతో గొడవపడి మనస్తాపంతో ఆత్మహత్యకు ప్రయత్నించింది. తంబళ్లపల్లె మండలం కోటకొండకు చెందిన మైనర్ బాలిక(16) ఆదివారం కాలేజీకి వెళుతున్నానని చెప్పడంతో సెలవురోజున వెళ్లడమేంటని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెంది బాలిక ఇంట్లోనే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ములకలచెరువు మండలం బురకాయలకోట పంచాయతీ బోయమాలపల్లెకు చెందిన గంగులప్ప కుమారుడు పి.వెంకటరమణ(55) కుటుంబ సమస్యలతో ఇంటివద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కురబలకోటకు చెందిన సుబానీ కుమారుడు అష్రఫ్ అలీ(21) కుటుంబ సమస్యలతో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితులను 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

మహిళల అదృశ్యం



షేక్ అబీదా



ఎ.రాములమ్మ

జమ్మలమడుగు : మండలంలోని గూడెంచెరువు రాజీవ్ నగర్ కాలనీకి చెందిన 23 ఏళ్ల వయసున్న షేక్ అబీదా కనిపించలేదంటూ ఆమె భర్త ఖలీల్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అర్బన్ సీఐ కరుణాకర్ వివరాల మేరకు.. ఈ నెల 22న ఇంటి వద్ద తన ఇద్దరు పిల్లలను వదిలి అబీదా బయటికి వెళ్లారు. తిరిగి ఇంటికి రాకపోవడంతో పలు చోట్ల గాలించారు. అయినా ఆచూకీ తెలియకపోవడంతో ఆదివారం ఆమె భర్త ఖలీల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే విధంగా కడపకు చెందిన దూలరాములమ్మ కడప నుంచి జమ్మలమడుగులో బంధువుల ఇంటికి వెళ్లింది. ఈనెల 21న వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో చలమారెడ్డి పల్లెకు చెందిన ఆమె భర్త సుబ్బరాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జ్వరంతో వైద్య విద్యార్థిని మృతి

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ పడిగపాటి మాధురి, రమణారెడ్డిల కుమార్తె పడిగపాటి సృజని(26) డెంగీ వ్యాధితో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆదివారం తెలిపారు. గత కొన్నేళ్లుగా హైదరాబాద్ సనత్ నగర్ కాలనీలో నివాసముంటున్నారు. కర్నాటక రాష్ట్రంలోని సులీయా వద్ద కేవీజీ మెడికల్ కళాశాలలో గైనకాలజీ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. అయితే డెంగీ లక్షణాలతో బాధ పడుతూ ఆసుపత్రిలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కళాశాల యజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

సెక్యూరిటీ గార్డు దుర్మరణం

వేంపల్లె : మండలంలోని ఇడుపులపాయ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ గార్డు ఎద్దుల రాజీవ్ ప్రసాద్ (32) ఆదివారం మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు.. వేంపల్లెలోని ఉషా కిరణ్ పాఠశాల సమీపంలో నివాసముంటున్న రాజీవ్ ప్రసాద్ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం యథాప్రకారం ద్విచక్ర వాహనంలో విధులకు వస్తుండగా వైఎస్సార్ ఘాట్ సమీపంలో మోటారు బైకు అదుపు తప్పి గోతిలో పడిపోయారు. తీవ్ర గాయాలైన అతడిని 108 ద్వారా వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని బంధువులు తెలిపారు. మృతి చెందిన వార్త తెలియగానే గర్భిణీ అయిన భార్య గీత, తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో ఒకరి అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని రామేశ్వరంరోడ్డులో హత్యకు గురైన అర్షద్ కేసులో నిందితుడిని వన్‌టౌన్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ వివరాల మేరకు.. మృతుడు అర్షద్‌కు రామేశ్వరం రోడ్డులోని వెంకటసుబ్బయ్యకు గతంలో చిన్నపాటి మనస్పర్థలున్నాయి. వెంకటసుబ్బయ్య కుటుంబసభ్యులను మృతుడు అర్షద్ కొన్ని రోజుల క్రితం అసభ్య పదజాలంతో దూషించాడు. ఇది మనసులో పెట్టుకున్న వెంకటసుబ్బయ్య శుక్రవారం రాత్రి మద్యం మత్తులో పడుకుని ఉన్న అర్షద్‌పై పెద్ద బండరాయితో కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసు బృందం విచారించి కొన్ని గంటల్లోనే మృతుడి ఆచూకీ కనుగొన్నారు. ఈ క్రమంలో అర్షద్‌ను వెంకటసుబ్బయ్య హత్య చేసినట్లు నిర్ధారించారు.

మైపాడు బీచ్‌లో కడప యువకుడు మృతి



ఇమ్రాన్ (ఫైల్)

కడప అర్బన్ : పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని మైపాడు బీచ్‌కు వెళ్లిన యువకుడు ఇమ్రాన్(20) ప్రమాదంలో మృతి చెందాడు. కడప నగరంలోని ఆటో మెకానిక్ యూసుఫ్ కుమారుడైన ఇమ్రాన్ తన స్నేహితులతో కలిసి ఆటవిడుపు కోసం ఓ వాహనంలో ఆదివారం మైపాడు బీచ్‌కు వెళ్లారు. అక్కడ సరదాగా సముద్ర అలలతో ఆడుకున్నారు. కొంతసేపటి తరువాత పెద్ద అల ఇమ్రాన్‌ను అమాంతం తీసుకువెళ్లింది. లబోదిబో మంటూ స్నేహితులంతా విలపించారు. స్థానికుల సహకారంతో ఇమ్రాన్ మృత దేహాన్ని వెలికితీసి కడపకు తీసుకువచ్చారు. తన చేతికి అందివచ్చిన కుమారుడు ప్రమాదశాత్తూ మరణించడం బాధాకరమని అతని తండ్రి యూసుఫ్, కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏపీజే అబ్దుల్ కలాం ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు రవికుమార్ యసఫ్, అతడి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పద్మశాలీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన పద్మశాలీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గం

కడప ఎడ్యుకేషన్ : పద్మశాలీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. కడప చిన్నచౌక్‌లోని పద్మశాలీ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కొంతం శివ రుద్రప్ప(అనంతపురం), ఎన్నికల పరిశీలకుడిగా శ్రీనివాసులు(తిరుపతి) వ్యవహరించారు. మరోమారు జిల్లా అధ్యక్షుడిగా గునిశెట్టి శ్రీనివాసులు,(పాఠశాల విద్యాశాఖ), ప్రధాన కార్యదర్శిగా చుప్పల విజయ్‌కుమార్(వెటర్నరీ) కోశాధికారిగా అవ్వారు రమేష్(పాఠశాల విద్య) ఎంపికయ్యారు. మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా జానపాటి వెంకటలక్ష్మి(పాఠశాల విద్య), ప్రధాన కార్యదర్శిగా అనిత(లెకర్చర్), చెన్నా విజయలక్ష్మి(పాఠశాల విద్య) ఎంపికయ్యారు. అలాగే రాష్ట్ర శాఖ ప్రతినిధిగా సోము జ్ఞానశంకర్(పదవి విరమణ లెక్చరర్), ఉపాధ్యక్షుడిగా వద్దిమాదవ, తిరుమల కొండ, సహాయ కార్యదర్శులుగా లోకేష్, గాజులపల్లి మల్లిఖార్జున, నల్లి పవన్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా వెంకటసుబ్బయ్య, క్రిష్ణయ్య తదితరులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గునిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ పద్మశాలీ ఉద్యోగుల సంక్షేమం మరియు సమస్యల సాధనకు తనవంతు సహకారం ఉటుందన్నారు. సమాజ నిర్మాణంలో, దేశాభివృద్ధిలో ఉద్యోగులందరూ తోడ్పాటు అందించాలని కోరారు.



జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన గునిశెట్టి శ్రీనివాసులు



జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన చుప్పల విజయ్‌కుమార్